వానకొండయ్య గుట్టపై క్వారీని రద్దు చేయాలి

దేవరుప్పుల, మే 5: మండలంలోని వానకొండయ్య లక్ష్మీనర్సింహస్వామి గుట్టపై క్వారీ అనుమతులను వెంటనే రద్దు చేయాలని లకావత్ తండావాసులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గుట్టపై లక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఉండడంతో ప్రతి సంవత్సరం జాతర కొనసాగుతుందన్నారు. గుట్టపై క్వారీతో దేవాలయం ధ్వంసమవుతున్నదన్నారు. మరోవైపు గుట్టపై పశుపక్షాదులు అంతరించి పర్యావరణానికి విఘాతం కలుగుతున్నదన్నారు. క్వారీ పనులతో పంటలపై రాతిపొడి, ధూళి పడుతున్నదన్నారు. క్వారీని వెంటనేరద్దు చేయాలని, లేకుంటే ఆందోళన నిర్వహిస్తామని కలెక్టర్‌కు చెప్పామని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో లాలూనాయక్, లావుడ్యా ఉపేందర్, బావ్‌సింగ్, బాపూజీ, సోమ్లా నాయక్, నర్సింహానాయక్, యాకూనాయక్, విజయ, మోహన్, రాజేశ్వరి, లలిత, బుచ్చమ్మ, నీల, సునీత, విమల పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తిస్తే గుర్తింపు

ధనుంజయ్‌ని సన్మానిస్తున్న ఎస్సై నగేశ్

నర్మెట, మే 5: అంకితభావంతో విధులు నిర్వర్తిస్తే ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందని స్థానిక ఎస్సై నగేశ్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మూడేళ్లుగా నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ ధనుంజయ్ వరంగల్ నగరంలోని ట్రాఫిక్ విభాగానికి బదిలీ అయిన సందర్భంగా సోమవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ధనుంజయ్‌ను సత్కరించిన అనంతరం ఎస్సై మాట్లాడుతూ విధి నిర్వహణలో బదిలీలు సహజమేనన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై శివ, హెడ్ కానిస్టేబుల్ హిదయత్ ఆలీ, కానిస్టేబుళ్లు ప్రవీణ్, రాజు, హమీద్, రాజు, రాము పాల్గొన్నారు.

వలసదారులను వెనక్కి పంపాలని వినతి

రఘునాథపల్లి, మే 5: నిబంధనలకు విరుద్ధంగా మన దేశంలో నివసిస్తున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్, రోహింగ్యా వలసదారులను వెనక్కి పంపాలని బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల వేణు కోరారు. ఈ మేరకు సోమవారం ఆర్ఐ శరత్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. వేణు మాట్లాడుతూ బతుకు దెరువు కోసం ఇక్కడికి వచ్చిన పాకిస్తాన్, బంగ్లాదేశ్‌కు చెందిన వారు దేశ విచ్ఛిన్నానికి సహకరిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంద వెంకటేశం, ద్వాపర రాజు, రంజిత్, వల్లపు తిరుమల్, దామోదర్‌రెడ్డి, కొమురెల్లి, రామచంద్రం, సంపత్, భిక్షపతి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రాజయ్య పరామర్శ

రఘునాథపల్లి, మే 5: మండలంలోని గోవర్ధనగిరికి చెందిన మాజీ సర్పంచ్ ముప్పిడి యాదగిరి ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, బీఆర్ఎస్ నాయకులు సోమవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబాన్ని ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వారాల రమేశ్‌యాదవ్, మండల ఇన్‌చార్జి ఎర్రళ్లో కుమార్ గౌడ్, మండల కో-ఆర్డినేటర్ ముసిపట్ల విజయ్, నాయకులు బండి కుమార్ సృజన్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADDITIONAL JUNIOR CIVIL JUDGE-CUM-JUDICIAL FIRST CLASS MAGISTRATE AT GHANPUR (STN)
I.A.No.572 OF 2024
IN O.S.No.354 OF 2024

Between:
Boini Ram Charan ..Petitioner/Plaintiff
AND
1.Gunde Yellamma and others
..Respondents

R3 Mandala Samba Siva Reddy, Sio Raji Reddy, aged major, Occu: Agriculture, R/o Namiligonda Village, Ghanpur Station Mandal, Jangaon District.

R4 Mandala Goda Devi, W/o Samba Siva Reddy, aged major, Occu: Housewife, Rio Namiligonda Village, Ghanpur Station Mandal, Jangaon District.

NOTICE

Please take notice that the above Petitioners filed the Pelition for impleading you as the proposed Respondent No. 3&4 OSNo.354 of 2024 and same is coming up for your appearance and counter before the above said Hon'ble Court on 11-9-2025 at 10.30 A.M. You are therefore hereby requested to appear and file counter before the above said Hon'ble Court on the above said date and time, oth-erwise you will be set exparte and the Hon'ble Court proceed with the case in your absence.

// By order of the Court//

Sd/- **CHILUKA VIJAYARAO** ADVOCATE,
Hanamkonda. Cell: 9390106472

కడియం శ్రీహరి పచ్చి అబద్ధాలకోరు..

- కారు గుర్తుపై గెలిచి బీఆర్ఎస్‌పై విమర్శలు చేయడం సిగ్గుచేటు
- నైతిక విలువలుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి
- మాజీ ఎమ్మెల్యే రాజయ్య సవాల్

జఫర్‌గఢ్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

జఫర్‌గఢ్, మే 5 : కారు గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి అవకాశవాది, పచ్చి అబద్ధాల కోరు అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ధ్వజమెత్తారు. అధికార దాహంతో కాంగ్రెస్‌లో చేరి బీఆర్ఎస్‌పై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజయ్య మాట్లాడారు. కడియం శ్రీహరికి నైతిక విలువలుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ పోటీ చేసి గెలువాలని సవాల్ విసిరారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధిలో కడియం శ్రీహరి చేసింది గాడిదగుడ్డు అని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో ఏ గ్రామంలో నైనా కడియం శ్రీహరి చేసిన అభివృద్ధి ఉంటే లక్ష్మీ నరసింహస్వామి వారి సాక్షిగా నిరూపించాలని రాజయ్య సవాల్ విసిరారు. 2015 నుంచి 2023 వరకు డిప్యూటీ సీఎంగా ఉన్న కడియం శ్రీహరి స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో పర్యటించిన సందర్భాలు లేవన్నారు. ఎనిమిదేండ్లు నియోజకవర్గానికి రాని శ్రీహరి ఎక్కడ అభివృద్ధి చేశారో తెలుపాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేగా శ్రీహరి గెలిచి 16 నెలలు కావస్తున్నా తట్టెడు మట్టి ఎత్తింది లేదు, అభివృద్ధి పనులు ప్రారంభించింది లేదని రాజయ్య విమర్శించారు. నియోజకవర్గ కేంద్రంతో పాటు మండలాల్లో ఎమ్మెల్యేగా, డిప్యూటీ సీఎంగా తాను చేసిన అభివృద్ధి పనులు, శంకుస్థాపనలు కనిపిస్తాయి తప్ప కడియం చేసింది ఏమీ లేదన్నారు. జఫర్‌గఢ్ మండల కేంద్రంలో సీహెచ్‌సీ దవాఖానకు రూ.4.50 కోట్లు, తిడుగు ఆకేరు వాగుపై బ్రిడ్జిని రూ.12 కోట్ల వ్యయంతో తాను నిర్మించానని గుర్తు చేశారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి లింకు రోడ్లతో పాటు డబుల్ రోడ్లను వేయించి రవాణా వ్యవస్థను బలోపేతం చేసింది తానేనని స్పష్టం చేశారు. సాగునీరందక పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతే తగుదునమ్మా అంటూ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి గతంలో కంటే ధాన్యం అధిక దిగుబడి వచ్చిందని చెప్పడం సిగ్గుచేటన్నారు. నియోజకవర్గంలోని ఏడు రిజర్వాయర్లతో లక్షా 50 వేల ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత తనదేనని రాజయ్య అన్నారు. నియోజకవర్గానికి కేటాయించిన 60 టీఎంసీలలో కేవలం 18 టీఎంసీలనే వినియోగించడంతో మిగతా 42 టీఎంసీల నీరు సముద్రం పాలు చేసిన ఘనత ఎమ్మెల్యే కడియం శ్రీహరిదేనని ఆయన విమర్శించారు. రైతుల సంక్షేమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి విస్మరించారని, పంట రుణాల మాఫీ పూర్తిగా అమలు కాలేదని రాజయ్య ఎద్దే వా చేశారు. హడావుడిగా రూ.800 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయించిన కడియం నేటికీ ఎక్క డా పనులు ప్రారంభించలేదన్నారు. రేవంత్‌రెడ్డి మెప్పు కోసం కడియం శ్రీహరి బీఆర్ఎస్ పార్టీని, అధినేత కేసీఆర్‌ను, కేటీఆర్‌ను విమర్శించడం మానుకోవాలని హితవు పలికారు. లేకుంటే నీవు రాజీనామా చేసేంతవరకు గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణు లు తిరగనివ్వరని స్పష్టం నియోజకవర్గ అభివృద్ధిలో ఎవరి పాత్ర ఎంతో చర్చకు సిద్ధమని రాజయ్య సవాల్ విసిరారు. గత నెల 27న జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ రాజయ్య కృతజ్ఞతలు తెలిపారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

మండలంలోని హిమ్మత్‌నగర్‌లో బీఆర్ఎస్ నాయకుడు ఇంతల కుమారస్వామి ఇటీవల మృతి చెందగా, మాజీ ఎమ్మెల్యే రాజయ్య మృతుడది కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జయపాల్‌రెడ్డి, నాయకులు గబ్బెట బుచ్చయ్య, కడారి శంకర్, సోమిరెడ్డి, కోత్వాల కుమార్, శ్రీధర్, గోలి కవిత, కాట కృష్ణ, కర్ణాకర్, పెంతల రాజ్‌కుమార్, మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ నజీర్, పులి ధనుంజయ్, జనార్ధన్, స్వామి, రాజయ్య పాల్గొన్నారు.

సెలవుల్లో సమ్మర్ క్యాంప్‌లు

దేవరుప్పుల, మే 5: వేసవి సెలవుల్లో ఎంపిక చేసిన పాఠశాలల్లో యంగ్ ఇండియా పేర పలు ఈవెంట్స్‌లో సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 8 నుంచి 25వ తేదీ వరకు మండలంలోని చినమడూరు, కడవెండి, కామారెడ్డిగూడెం, దేవరుప్పుల, కోలుకొండ, పెదమడూరు, సింగరాజుపల్లి ఉన్నత పాఠశాలల్లో క్యాంపులు ఉంటాయి. ఆయా గ్రామాల పరిధిలోని ఆవాసాల్లో 6 నుంచి 18 సంవత్సరాల లోపున్న వారు ఈ సమ్మర్ క్యాంపులో పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు. .

సమస్యలతోపాటు ఆధారాలు సమర్పించాలి : కలెక్టర్

స్టేషన్ ఘన్‌పూర్, మే 5 : రైతులు తమ సమస్యలను తెలుపడంతోపాటు వాటికి సంబంధించిన ఆధారాలను దరఖాస్తుతో జతచేయాలని, అప్పుడే వాటిని పరిష్కరించడం వీలవుతుందని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. భూభారతి చట్టం అమలుపై జిల్లాలో స్టేషన్‌ఘన్‌పూర్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికై చేసిన నేపథ్యంలో సోమవారం విశ్వనాథపురం, కొత్త పల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్‌ఘన్‌పూర్, విశ్వనాథపురంలోని ధా న్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. తేమ శాతం ఉన్నప్పటికీ ధాన్యం కొనుగోలులో ఆలస్యం చేయొద్దని నిర్వాహకులను ఆయన కోరారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, డీఏవో హనుమాన్‌నాయక్, ఆర్డీవో డీఎస్ వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐలు శ్రీకాంత్, సతీశ్, పంచాయతీ కార్యదర్శులు నర్మద, సంతోష్, మాజీ ఎంపీటీసీ వెంకటస్వా మి, మాజీ సర్పంచ్‌లు ఆనందం, మల్లేశం పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఇందిరమ్మ ఇండ్లు : బీఆర్ఎస్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిందే రామోజీ

కొడకండ్ల, మే 5 : నిబంధనలకు విరుద్ధంగా గ్రామసభలు నిర్వహించకుండా అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు తమకు అనుకూలంగా ఉన్నవారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ మండి పడ్డారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 18 నెలలు అవుతున్నా మండలంలో చేసిన అభివృద్ధి ఏమీలేదన్నారు. హామీలు అమలు చేయని సీఎం రేవంత్ రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డిపై ప్రజ లు అసహనం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. ఎర్రబెల్లి దయాకర్ రావు మంత్రిగా ఉన్నపుడు చేసిన అభివృద్ధి పనులు, నిధులను కాంగ్రెస్ నేతలు తాము చేశామని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. మార్కెట్ మాజీ చైర్మన్ పేరం రాము మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో అధికారుల పర్యవేక్షణ లేదని, కాంట్రాక్టర్లు ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించకుంటే విజిలెన్స్/క్వాలిటీ కంట్రోల్‌పై పర్యవేక్షించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీసీసీ మాజీ చైర్మన్ గాందీనాయక్, రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు దీకొండ వెంకటేశ్వర్ రావు, సొసైటీ వైస్ చైర్మన్ మేటి సోమరాములు, నాయకులు బాకీ ప్రేమ్‌కుమార్, మసురం వెంకటనారాయణ, దేశగాని సతీశ్, మంగ్యానాయక్, భూక్యా శ్రీను, బాలకిషన్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రారంభం

జనగామ చౌరస్తా, మే 5 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరానికిగాను ఉచితంగా అందించే పాఠ్య పుస్తకాలను జిల్లాలోని అన్ని మండల కేంద్రాలకు పంపిణీ చేస్తున్నట్లు డీఈవో డీ భోజన్న తెలిపారు. జిల్లా కేంద్రంలోని వీవర్స్ కాలనీ పాఠ్య పుస్తకాల గోదాం నుంచి మండల కేంద్రాలకు సోమవారం నుంచి పుస్తకాలను చేరవేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాకు 2 లక్షల 14 వేల 460 పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉండగా, ఇప్పటి వరకు లక్షా 45 వేల 742 పుస్తకాలు వచ్చాయన్నారు. ఇందులో జనగామ మండలానికి 10 510 పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠ్య పుస్తకాల మేనేజర్ సంపత్, ఎంఈవో శంకర్‌రెడ్డి, సీఆర్పీలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

కళాకారుల సంక్షేమానికి కృషి : ఎమ్మెల్యే

పాలకుర్తి, మే 5: నియోజకవర్గంలోని కళాకారుల సంక్షేమానికి కృషి చేస్తానని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బషారత్ గార్డెన్‌లో శ్రీ వెంకటేశ్వర చిందు యాక్షగాన కళాకారుల ద్వితీయ వార్షిక మహాసభలు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో గడ్డం జలేంధర్ అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో ప్రాచీన కళారూపాల్లో చిందు యాక్షగానానికి ప్రత్యేకత ఉందన్నారు. కళాకారులకు తాము చేయూతనిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, బైర్ భార్గవ్, ఎర్రబెల్లి రాఘవరావు, పోగు శ్రీనివాస్, భూమ రంగయ్య, లావుడ్యా భాస్కర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

'ప్రజావాణి'లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా

జనగామ చౌరస్తా, మే 5 : ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌తో కలిసి 'ప్రజావాణి' కార్యక్రమంలో భాగంగా 60 మంది అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జనగామ మండలం వెంకిర్యాలకు చెంది న టేకులపల్లి సారయ్య, చెండి బాలమణి, సంపత్, మేరుగు శ్వేత, అంజలి, తాళ్ల పల్లి నవనీత కలెక్టర్ అర్జీ సమర్పించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో పేదలకు కాకుండా వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఇండ్లు కలిగి ఉన్న అధికార కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు మాత్రమే మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. నిరుపేదలైన తమకు ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. దేవరుప్పుల మండలం సీతారాంపురంకు చెందిన తోరిపురి రాములు తనకు సంబంధించిన ఎకరం రెండు గుంటల వ్యవసాయ భూమిని అక్రమంగా పట్టా చేసుకున్న వారిపై విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరాడు. లింగాల ఘనపురం మండలం కళ్లెంకు చెందిన లక్ష్మీనర్సమ్మ అనే వృద్ధురాలి ఆస్తిని తీసుకున్న నలుగురు కుమారులు తన పోషణ చూడడం లేదని, అందువల్ల తన ఆస్తిని తిరిగి తన పేరిట మార్చాలని కోరుతూ కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. జనగామ పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన కవితకు భర్త చనిపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, తనకు రుణ సాయం అందించాలని అర్జీ అందజేశారు. పాలకుర్తి మండలం ముత్తారంకు చెందిన మంగమ్మ ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకోగా, మంజూరు జాబితాలో తన పేరు లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా స్పందిస్తూ అర్జీదారులు సమర్పించిన ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పక్కాగా నిర్వహించాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రాష్ట్ర స్థాయిలో జనగామ జిల్లా ప్రథమ స్థానంలో ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గోపీరామ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, డీఆర్డీవో వసంత, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఏవో రామారావు నాయక్, డీపీవో స్వరూప, కలెక్టరేట్ ఏవో మన్సూరి పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం

కామారెడ్డిగూడెం పాఠశాలలో విద్యార్థులకు సన్మానం

శివునిపల్లిలో విద్యార్థినికి స్వీటు తినిపిస్తున్న అర్డీవో

దేవరుప్పుల, మే 5: పదో తరగతి చదివి ఫలితాల్లో మండలంలోనే అత్యధిక మార్కులు పొందిన చినమడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి గడ్డం కేజీయాకు కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు గొరిగె నర్సింహ రూ. 5 వేలు నగదు బహుమతి అందజేశారు. పాఠశాలలో సోమవారం నిర్వహించిన సమావేశంలో అప్పిరెడ్డిపల్లికి చెందిన గడ్డం కేజియా చదువులో చురుకైన విద్యార్థిని. టెన్త్‌లో 546 మార్కులు సాధించడంతో అభినందించి సత్కరించారు. టెన్త్‌లో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థికి రూ. 5 వేలు ప్రతి విద్యాసంవత్సరం అందజేస్తానని ఆయన ప్రకటించారు. ఈ విద్యాసంవత్సరంలో 26 మంది పరీక్ష రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ డైరెక్టర్ మైదం జోగేశ్వర్, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ గూడ నర్సయ్య, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు జనగామ సంతోష్, మండల నాయకుడు వంగ అర్జున్, గ్రామైక్య మహిళా సంఘం అధ్యక్షురాలు కొలుపుల లక్ష్మి, మాజీ కారోబార్ పూజారి యాదగిరి, గడ్డం సోమరాజ్ పాల్గొన్నారు. కామారెడ్డిగూడెం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను సత్కరించారు. అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు మమత, మాజీ ఎంపీటీసీ మహ్మద్ జాకీ ర్ హాజరై ఉత్తమ విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందించారు. ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రకుమార్ మాట్లాడుతూ 543 మార్కులతో మూఢ ఐశ్వర్య మండలంలోనే సెకండ్ టాపర్‌గా నిలిచిందన్నారు. మధుప్రియకు 533, బట్ట సంపత్ 525, సాత్విక 524, కీర్తిక 519, వైష్ణవి 513, రాజేశ్‌కు, శ్రీచరణ్ 506, తరుణ్‌కు 500 మార్కులు సాధించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులను ఉపాధ్యాయులు సన్మానించారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్ ఘన్‌పూర్ : మండలంలోని శివునిపల్లి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 50 మంది పరీక్షలు రాశారు. వీరిలో 500పైగా మార్కులు సాధించిన వారిని అర్డీవో డీఎస్ వెంకన్న అభినందించి స్వీట్లు పంపిణీ చేశారు. విద్యార్థులు లక్ష్యాన్ని సాధించేలా కృషి చేయాలని కోరారు. పాఠశాలలో వంద శాతం మంది ఉత్తీర్ణత సాధించేలా కృషి చేసిన పాఠశాల హెచ్ఎం ధరావత్ రాజును ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంవో సారయ్యదొర, ఎస్వో కిష్ణ పాల్గొన్నారు.

దళితుల భూముల్లో సబ్ స్టేషన్ నిర్మించొద్దు

జనగామ చౌరస్తా, మే 5 : దేవరుప్పుల మండలం చిన్నమడూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని రాంబోజిగూడెం దళితుల భూముల్లో 132 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణం చేయొద్దని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో జస్టిస్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా జిల్లా కన్వీనర్ కన్నారపు పరశురాములు ఆధ్వర్యంలో చిన్నమడూరుకు చెందిన దళిత రైతులు, వేణుగోపాలస్వామి ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మేడ సోమనర్సయ్య, పాలడుగు యాదగిరి, మాంకాళి మధు, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఈరెంటి విజయ్ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాంబోజిగూడెంలో సర్వే నంబర్ 524, 525, 526, 527లో 48 ఎకరాల అసైన్డ్ భూమి ఉందని తెలిపారు. ఇందులో దళిత రైతులు ఒక్కొక్కరికి 18 గుంటల చొప్పున గత ప్రభుత్వం పట్టాదారు పాస్‌బుక్స్ ఇచ్చిందన్నారు. ఈ భూమిలో ప్రస్తుతం 132 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దళిత రైతుల భూములను లాక్కునేందుకు అధికారులు యత్నిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

బచ్చన్నపేట, మే 5 : మండలంలోని కొన్నె గ్రామంలో రైతు కురాం వెంకటయ్యకు చెందిన ఆవును ఇటీవల పిచ్చి కుక్కలు దాడి చేసి చంపిన నేపథ్యంలో బాధితుడిని బీఆర్ఎస్ నేత కోడూరి శివకుమార్‌గౌడ్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటయ్యకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందించి భరోసా ఇచ్చారు. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడమే తన ధ్యేయమని శివకుమార్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పురుపు సిద్ధారెడ్డి, యాట రామచంద్రయ్య, ప్రభాకర్, తేలు కిష్టయ్య, మహేందర్, శ్రీనివాస్, కనకయ్య పాల్గొన్నారు.

తరిగొప్పులలో..

తరిగొప్పుల : ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటానని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏడెల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కనిలకుంట్ల గ్రామానికి చెందిన బాషబోయిన రాజు (40) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏడెల్లి శ్రీనివాస్‌రెడ్డి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ముదిరాజ్ సంఘం సభ్యులు రూ.5 వేలు సాయం చేశారు. ఆర్థిక సాయం అందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిలివేరు ఉప్పలయ్య,బాషబోయిన బాలరాజు, సుంకరి కనుకరాజు, రాములు, కల కుంట్ల రాజు,కలకుంట్ల వీరస్వామి, సుంకరి రవి, సుంకరి యాదగిరి,కల కుంట్ల సాంబరాజ్,నందరబోయిన యాదగిరి పాల్గొన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

బచ్చన్నపేట, మే 5 : పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాపాలన కార్యక్రమంలో వందలాది మంది పేదలు ఇళ్ల కోసం దరఖాస్తు చేస్తే కేవలం పదుల సంఖ్యలో మంజూరు చేయడం ఎంతవరకు సమంజసమని వెంకటేశ్ ప్రశ్నించారు. ఇందిరమ్మ కమిటీలో నచ్చిన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేశారని ఆరోపించారు. 60 గజాల్లోనే ఇల్లు కట్టుకోవాలనే నిబంధన సరైంది కాదన్నారు. ఈ సమావేశంలో నా యకులు నర్సింహులు, ఎల్లయ్య, ఆశోక్, కవిత పాల్గొన్నారు.

పలు మండలాల్లో గాలి వాన బీభత్సం

స్టేషన్ ఘన్‌పూర్/చిల్పూరు, మే 5 : జిల్లాలో సోమవారం రాత్రి గాలి వాన బీభత్సం సృష్టించింది. రాత్రి 10 గంటల సమయంలో గాలి దుమారంతో మొదలైన వర్షం స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు, జఫర్‌గఢ్ మండలాల్లో దంచికొట్టింది. ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు గ్రామాల్లో రహదారులపై చెట్లు నేలకూలాయి. దీంతో రవాణాకు అంతరాయం ఏర్పడింది. మరోవైపు ఆయా మండలాల్లో విద్యుత్ నిలిచిపోయి అంధకారం ఏర్పడింది. అకాల వర్షంతో చేతికొచ్చే దశలో ఉన్న వరి పంట దెబ్బతినడమేగాక కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దేశ ప్రజలపై దాడి చేస్తున్న బీజేపీ : కడియం

స్టేషన్ ఘన్‌పూర్, మే 5 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం శత్రుదేశంతో తలపడకుండా మనదేశంలోని ప్రజలపైనే దాడులు చేయ